TGTEL/25/A4103

# తెలంగాణవీణ

నిజం నిగ్గు తేల్చుద్దాం..




epaper.telanganaveena.in హైదరాబాద్ ఎడిటర్ : కె. శ్రీనివాస్ సంపుటి:01 సంచిక:265 06 మంగళవారం అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల: రూ. 3/-

### ఇరాన్-అమెరికా మధ్య సంఘర్షణల వల్లే

# ఇంధన సంక్షోభం

### కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది

### భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. బ్యారెల్‌కు 100 డాలర్లను మించి ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరలపై పడుతోంది. ఇప్పటికే ప్రైవేట్ ఇంధన సరఫరా సంస్థ నయరా ఎనర్జీ ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. దీంతో రానున్న రోజుల్లో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు కూడా ఇంధన ధరలను పెంచుతాయనే వార్తలు వినిపిస్తున్నాయి.

### సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి

# బొనాంజా

### ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

### బోనస్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**



దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్?ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్? రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## ఫారమ్-6 మార్పులపై

# సుప్రీం వ్యాఖ్యలు

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం.

# ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే



- ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి
- దొంగ ఓటర్లను తొలగించడమే లక్ష్యం
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.



## రేవంత్ సర్కార్

# కుట్రలు

### వారసత్వ కట్టడాలను
### కూల్చేసే పన్నాగం
### బొగ్గు గని ప్రతిపాదనను
### వెనక్కి తీసుకోవాలి
### లేకుంటే పెద్ద ఎత్తున
### మేం ఉద్యమిస్తాం
### బీఆర్ఎస్ వర్కింగ్
### ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు.

### ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు

# నిర్మించండి

- డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయండి
- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి
- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు డీపీఆర్ వేగవంతం చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందించాలని ఆయన కోరారు.



# వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్
- కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

ఈ ఏడాదికి నోబెల్ పురస్కారాల విజేతల ప్రకటన వైద్య శాస్త్రంతో ప్రారంభమైంది. మెదడు కార్యకలాపాలపై (ఆప్టోజెనెటిక్స్) పరిశోధకులకు వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి వరించింది. మెదడులోని నాడుల కార్యకలాపాలు ప్రారంభం లేదా నిలిపివేత సమయంలో సంభవించే అంతర్గత ప్రక్రియలపై పరిశోధనలకు అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్ (54), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (71), జార్జ్ నాజెల్ (73) అనే శాస్త్రవేత్తలకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు.



# వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

### రష్యా ల్యాబ్‌లో గుర్తుతెలియని ఇన్ఫెక్షన్?

- ఒకరు మృతి.. వందలమంది క్వారంటైన్
- అప్రమత్తమైన అమెరికా, ప్రపంచ దేశాలు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

రష్యాలో కొత్త ఇన్?ఫెక్షన్? భయాలు చెలరేగాయి. సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్? టెక్నీషియన్? తెలియని ఇన్ఫెక్షన్?తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్?లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్?ఫెక్షన్?/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్?ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు.





### ఫారం 6ను చట్టవిరుద్ధంగా,

# ఏకపక్షంగా మార్చారు

- మార్చారనేది నిస్సందేహంగా రుజువైంది
- నిబంధనలకు విరుద్ధంగా సీఈసీ నిర్ణయాలు
- సిఈసి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి
- ఫారమ్-6 మార్పులపై రాహుల్ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో ఫారమ్-6 మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన వేళ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జ్ఞానేశ్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఫారమ్-6లో మార్పులు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో జజుజతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఇప్పుడు నిస్సందేహంగా రుజువైందని అన్నారు.



**న్యూఢిల్లీ, అక్టోబర్ 05(తెలంగాణ వీణ):**

అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు.

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

### సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి

మొదటిపేజీ తరువాయి

# బోనాంజా

ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి అని అన్నారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ముందస్తు దసరా, దీపావళి సుభాకాంక్షలను కిషన్? రెడ్డి తెలియజేశారు.

మొదటిపేజీ తరువాయి

# వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్?మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. సైబీరియాలోని యాంటీ–ప్లేగ్? పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్? తెలియని ఇన్?ఫెక్షన్?తో మరణించారు. ఇర్కుట్స్క్? సమీపంలోని షెలెఖోవ్?లో ఉన్న యాంటీ–ప్లేగ్? రీసెర్చ్? ఇన్?స్టిట్యూట్?లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్? దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమెనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్?ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్? , షెలెఖోవ్? నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్? పేర్కొంది. ఏది ఏమైనపప్పటికీ, ల్యాబ్? ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్?ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్? సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్? ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్? వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్? పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్? గవర్నర్? ఇగోర్ కోబ్జెన్? మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్?ఫెక్షన్? ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్? మాట్లాడుతూ, ఈ ఇన్?ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్? టెక్నీషియన్?తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు.

# రేవంత్ సర్కార్ కుట్రలు

మొదటిపేజీ తరువాయి

మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

# ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి" అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

మొదటిపేజీ తరువాయి

### ఇరాన్-అమెరికా మధ్య సంఘర్షణల వల్లే

# ఇంధన సంక్షోభం

ఈ క్రమంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు ధరలు 100 డాలర్లను దాటినప్పుడు పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని చెప్పలేమని వ్యాఖ్యానించారు. ఇరాన్–అమెరికా మధ్య సంఘర్షణల ప్రభావం వల్లే ఇంధన సంక్షోభం నెలకొందని అన్నారు. "క్రూడ్ ఆయిల్ ధరలు అస్థిరతతో కొనసాగుతున్నాయి. చమురు ధరలలో భారీ పెరుగుదల మార్కెట్ అనిశ్చితికి ప్రతిబింబంగా చెప్పవచ్చు. కొనసాగుతున్న సంఘర్షణల మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చాలా దూరంలో ఉంది. బ్యారెల్‌కు 100 డాలర్ల కంటే ఎక్కువ ముడి చమురు ధరలు సూచిస్తున్నాయి. ధరలు ఇంకా సాధారణ స్థితికి రాలేదు. ఇరాన్–అమెరికా మధ్య ఘర్షణ ప్రభావాన్ని కేవలం ఆర్థిక కోణంలోనే చూడకూడదు. ఇంధన సరఫరాకు అంతరాయం వల్ల సామాన్య కుటుంబాలు, ఉపాధి, జీవనోపాధిపై ప్రత్యక్షంగా ప్రభావం పడుతుంది. మనకు ఏమాత్రం సంబంధం లేని సంఘర్షణల వల్ల మూల్యం చెల్లిస్తున్నాం. ఇంధనం, వాణిజ్య రాకపోకలను పునరుద్ధరించాలని భారతదేశం కోరుతుంది" అని జైశంకర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితి నుండి వెలువడే ఎలాంటి ఫలితమైనా అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉంటుందని జైశంకర్ నొక్కి చెప్పారు. ప్రపంచ ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యంపై ఇరాన్ సంఘర్షణ విస్తృత ప్రభావంపై ఆందోళనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కాగా ఇంధన ధరలపై పెరుగుదలపై వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పెట్రోల్, డీజిల్ పెరుగుదల రవాణ రంగంపై పడుతోంది. రవాణ ఖర్చులు పెరగడం వల్ల నిత్యావస సరుకుల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఇది సామాన్యులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తుంది.

### ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు

# నిర్మించండి

మొదటిపేజీ తరువాయి

గుజరాత్?లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్' --2026 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్?హెచ్?-65, 6ం2 లేన్ల విస్తరణ, ఆర్?ఆర్?ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే అంశాలపై చర్చించారు. హైదరాబాద్--శ్రీశైలం ఎన్?హెచ్?? -765పై ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్‌హెచ్ - 65లో ఎల్‌బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు (6ం2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్‌ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని నితిన్? గడ్కరీకి కోమటిరెడ్డి వివరించారు. మియాపూర్ -- ఎల్బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్?డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్--నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు.తెలంగాణ-- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్?హెచ్? - 65ను ఆరు(6ం2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సీఆర్?ఐఎఫ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 511.68 కి.మి. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్.ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి--నర్సాపూర్--తూప్రాన్--గజ్వేల్--జగదేవ్‌పూర్--భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న ట్రిబుల్ ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్.హెచ్.ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

# వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

'మెదడులోని రహస్యాలను ఛేదించడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు.గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతిని ప్రకటించిన అనంతరం, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ప్రకటిస్తారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, రాయల్ స్వీడిష్ అకాడమీ, నార్వేజియన్ కమిటీలు నోబెల్ బహుమతలను అందజేస్తాయి. ఏటా అక్టోబరు మొదటి వారంలో విజేతలను ప్రకటించి, డిసెంబరు 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున బహుమతులను ప్రధానం చేస్తారు.

మొదటిపేజీ తరువాయి

# ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

బీజేపీకి సహాయం చేయడానికి ఆయన తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు అని తెలిపారు. తన ఆరోపణకు మద్దతుగా గతంలో ఈసీఐ విడుదల చేసిన పత్రికా ప్రకటన చిత్రాన్ని కూడా పంచుకున్నారు. అందులో "సర్ కోసం ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించింది. సర్ లేని కాలానికి, నిబంధనల (ఓటర్ల నమోదు నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగించాలి." అని అందులో ఉంది. మరోవైపు ప్రక్రియలో జరిగిన పేర్ల తొలగింపులు రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ప్రజలు ఇప్పుడు గ్రహించారని ఆమె స్పష్టం చేశారు. "జరిగిన ఈ తొలగింపులు మన రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై మేము నిరసన వ్యక్తం చేస్తున్నాం. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రజలు గ్రహించారని నేను భావిస్తున్నాను. కాబట్టి మా నిరసనను కొనసాగిస్తాం." అని అన్నారు. సీఈసీ స్పష్టంగా, నిస్సందేహంగా అబద్ధం చెప్పారని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ విరుచుకుపడ్డారు. ప్రధాని భయపడే జెన్ జెడ్ ఓటర్లను తొలగించడానికి సీఈసీ స్వయంగా ఫారం 6ను ఉద్దేశపూర్వకంగా సవరించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఆప్ నేత మనీష్ సిసోడియా ఆ మార్పులపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫారం 6ను మార్చడానికి జ్ఞానేష్ కుమార్ అనుమతి తీసుకోలేదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని సిసోడియా అన్నారు. జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మార్పులు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు ప్రక్రియపై ప్రభావం చూపవచ్చని సిసోడియా ఆరోపించారు. ఫారం 6 అనేది ఒక దరఖాస్తు. దీని ద్వారా అర్హత ఉన్న వ్యక్తి మొదటిసారిగా ఓటర్ల జాబితాలో చేరాలని కోరుకుంటారు.

మొదటిపేజీ తరువాయి

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్– స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా– యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్– స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాష్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.మరోవైపు భారత్– స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఈ మేరకు సోమవారం దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్–స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్?ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది. అదే సమయంలో బయోటెక్, లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి భారతదేశంలోని ముఖ్యమైన రంగాల్లోకి కొత్త స్విస్ పెట్టుబడులను ఆకర్షిస్తాం. ప్రజల మధ్య సంబంధాలే మన భాగస్వామ్యానికి అతిపెద్ద బలం. ఈ రోజు సంతకం చేసిన మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్, యంగ్ ప్రొఫెషనల్స్ అగ్రిమెంట్‌తో స్విట్జర్లాండ్‌లో భారతీయ విద్యార్థులు, పరిశోధకులకు అనేక కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన, సంప్రదింపులు, దౌత్యం పట్ల భారత్?– స్విట్జర్లాండ్ ఒకే విధమైన నిబద్ధతను పంచుకుంటున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించడానికి ఇరు దేశాలు తమ సహకారాన్ని కొనసాగిస్తాయని అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు అత్యంత కీలకమని ఇరు దేశాలు భావిస్తున్నాయని వ్యాఖ్యానించారు. "భారత్, స్విట్జర్లాండ్ రెండూ ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన, సంప్రదింపులు, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం మేం కలిసి పనిచేస్తాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఇలా ఎక్కడైనా శాంతి కోసం చేసే ప్రతి అర్థవంతమైన ప్రయత్నానికి భారతదేశం నిరంతరం మద్దతు ఇచ్చింది. పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు అవసరమనే విషయంలో కూడా మేమిద్దరం ఏకీభవిస్తున్నాం." అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. భారత్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అమలు తర్వాత ద్వైపాక్షిక సంబంధాల్లో వేగం పెరుగుతుందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఈ క్రమంలోనే అధ్యక్షుడు గై పార్మెలిన్‌ను ప్రశంసించారు. "స్విట్జర్లాండ్ అధ్యక్షుడికి స్వాగతం పలకడం నాకు చాలా సంతోషంగా ఉంది. అన్నింటికంటే ముందు భారత్–స్విట్జర్లాండ్ సంబంధాల పట్ల ఆయన నిబద్ధతను నేను అభినందిస్తున్నాను. గత ఏడాది అక్టోబర్‌లో ఆయన వ్యక్తిగత మద్దతుతోనే మేము దేశాలతో చారిత్రాత్మక వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశాం. యూరోపియన్ ఆర్థిక కూటమితో భారతదేశం కుదుర్చుకున్న మొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇదే." అని ప్రధాని మోదీ అన్నారు.

# బాణం గుర్తుపైనే ఓటు వేయాలి

## ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పిలుపు

తెలంగాణ వీణ// మెదక్ జిల్లా ప్రతినిధి

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ కు మద్దతుగా బాణం గుర్తుపైనే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆర్టీసీ కార్మికులకు పిలుపునిచ్చారు.పీసీసీ సూచన మేరకు సోమవారం మెదక్ డిపో వద్ద నిర్వహించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నది. కార్మికుల బలమైన యూనియన్ తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు ప్రతి కార్మికుడు అండగా నిలవాలని, ఈ నెల 9న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుపైనే తమ ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రాధిక భూపతి రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.ఎస్.రెడ్డి, నరసింహులు, సంగమేశ్వర్, రాజు, ఈశ్వర్, ముజీబ్, అనిత, విమల, సౌజన్య, పద్మ, సమీర్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు. ఇట్టి సందర్భంగా డిపో కమిటీ పక్షాన గౌరవ ఎమ్మెల్యే గారికి సన్మానించడం జరిగినది.



# వైభవం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో తోపులాట

తెలంగాణ వీణ//మెదక్ జిల్లా ప్రతినిధి,

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా భారీగా ప్రజలు తరలిరావడంతో కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్.జాతి రత్నాలు ఫైమ్ కుమారి పరియా అబ్దుల్లా చేతుల మీదు షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు.ప్రారంభోత్సవం అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు ఒకేసారి షాపింగ్ మాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో రద్దీ ఏర్పడింది. ఈ క్రమంలో కొందరు మహిళలు బట్టలు, చీరలు కొనుగోలు చేసేందుకు ముందుకు వెళ్లడంతో తోపులాట జరిగినట్లు ప్రత్యక్షంగా కనిపించింది.ఉచితంగా చీరలు పంపిణీ చేస్తున్నారనే ప్రచారం లేదా అపోహతో కూడా కొంతమంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నట్లు సమాచారం. దీంతో షాపింగ్ మాల్ ప్రవేశ ద్వారం వద్ద ఒక్కసారిగా రద్దీ పెరిగింది.పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నించినప్పటికీ, భారీగా జనసందోహం ఉండటంతో కొంతసేపు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు.ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పడిన ఈ రద్దీతో కొద్దిసేపు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు







# శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి కొత్తగూడెం పేరు పెట్టాలని డిమాండ్

## -అఖిలపక్ష నేతలు -అదనపు కలెక్టర్ పి.శ్రీజ కు వినతి





తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం: కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలపై కొత్తగూడెం పేరు పెట్టాలని ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 14వ మరియు 15వ డివిజన్ల అఖిలపక్ష నేతలు. పగడాల మల్లేష్,యర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, రావుల హనుమంతరావు, డిమాండ్ చేస్తూ ఈరోజు ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ టి. శ్రీజకు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కొత్తగూడెం రెవెన్యూపరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం,కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్న విషయం విదితమే. అయితే, ఈ నిర్మాణాలకుసంబంధించి పత్రికా మరియు ఇతర ప్రచార మాధ్యమాలలో ఈ ప్రాంతాన్ని అల్లీపురం పేరుతో పేర్కొనడం స్థానిక ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. వాస్తవానికి, దేవాలయ నిర్మాణం జరుగుతున్న స్థలం, పి.బి. నగర్ ప్రాంతం మరియు సంబంధిత భూములు, సర్వే నంబర్లు అన్నీ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయన్నారు.అటువంటప్పుడు, కొత్తగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక కట్టడాలకు అల్లీపురం పేరును మాత్రమే ప్రస్తావించడం వల్ల స్థానిక ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంటోంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంగా మారిందని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను మరియు వాస్తవ రెవెన్యూ పరిధిని పరిగణనలోకితీసుకొని, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలు, అధికారిక రికార్డులు, ప్రచార ప్రకటనలు మరియు ఇతరత్రా అన్ని సందర్భాలలో 'కొత్తగూడెం' లేదా'కొత్తగూడెం-అల్లిపురం రోడ్డు' అనే పేరును స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కొత్తగూడెం ప్రాంత ప్రజలు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక పెద్దల సమక్షంలో చర్చించి, ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగిందని గౌరవ మంత్రి వర్యులు ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి,కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అఖిల పక్ష నాయకులు మాకెనబోయిన నాగేశ్వరరావు, పల్లెబోయిన పుల్లారావు, బొమ్మిశెట్టి లక్ష్మినర్సయ్య, పొదిల ఉపెందర్, యర్రబోయిన వెంకటయ్య, నాగటి శేషయ్య, పర్వత సైదులు, పొదిల రామారావు, బొమ్మిశెట్టి భాస్కర్, చామకూరి శంఖర్, చిర్ర శంఖర్, పడగాల వెంకటేశ్వర్లు, దంతాల నాగరాజు, షేక్.మీరా, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, లింగనబోయిన దాసు, బండ్ల వెంకటేశ్వర్లు, కర్రి కృష్ణ,మొర్రిమేకల వెంకటనారాయణ, అమరయ్య, చిగంటి శ్రీను, పగడాల అనంతరాములు,తదితరులు పాల్గొన్నారు.

# రజకుల సంక్షేమానికి కృషి... వారు సమాజానికి ఆడబిడ్డల్లాంటి వారు

తెలంగాణ వీణ//మెదక్ జిల్లా ప్రతినిధి




జిల్లా కేంద్రంలో రజకభవన నిర్మాణానికి హామి స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు మెదక్ జిల్లా రజకులు సమాజానికి ఆడబిడ్డల్లాంటి వారని, మనిషి పుట్టక మొదలు కాటికి వెల్లేవరకు వారు చేసే సేవలు ఎనలేనివని వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రజక మహాసభకు ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. రజకుల అభివృద్ధి సమాజాభివృద్ధిలాంటిదన్నారు. వారికి పట్టణ పరిధిలో ఎకరం ప్రభుత్వం స్థలం ఇవ్వటంతో పాటూ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చుతనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. గతంలో 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు గాలి మాటలు తప్పా చేసిందేమి లేదన్నారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ, సమాజంలో నిస్వార్థసేవకులు రజకులేనని కొనియాడారు. జిల్లా కేంద్రంలో రజకభవన నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం రజకఫెడరేషన్ చైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగించే వారిలో అత్యంత వెనుకబడిన వారు రజకులని వాపోయారు. భవన నిర్మాణంకోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రమణ మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు కృషితో రజకభవనం సాధించుకుని ఆయనకు కృతజజతగా ఉండాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కానుగ రాధిక, నరేశ్‌గౌడ్, రజక రాష్ట్రనేతలు శ్రీనివాస్, సంపత్, పట్టణ అధ్యక్షులు మల్లేశం, శివ, వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్ట రామలింగేశ్వరుడిని దర్శించుకున్న గవర్నర్ సతీమణి జానకి శుక్ల...

## పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు, వేద పండితులు...

తెలంగాణవీణ, కీసర :

కీసరగుట్ట శ్రీ భవానీ సమేత రామలింగేశ్వర స్వామివారిని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సతీమణి జానకి శుక్ల సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆమెకు ఆలయ ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, అర్చకులు, వేద పండితులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం జానకి శుక్ల గర్భాలయంలో కొలువైన శ్రీ భవానీ సమేత రామలింగేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం చేయగా, ఈవో మరియు చైర్మన్ స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.





# గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

## అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

## దేశంలోనే తొలిసారి.. జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు






తెలంగాణ వీణ//మెదక్ జిల్లాప్రతినిధి

రామాయంపేట--సిద్దిపేట మధ్య చీఎ-765ఙ+ వెంట భారీ ప్లాంటేషన్ కార్యక్రమన్నీ ఈ నెల 6న ప్రారంభించ నున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్ర మానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన విజయవంతం పై అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావు లు ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించ నున్నారనీ, పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించ నున్నారని తెలిపారు.

జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు.జాతీయ రహదారి వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని,పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతో భారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి కార్యక్ర మాన్ని గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారం భిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

### నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభం

మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుంటారనీ,2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు.మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరి, 3.30 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారనీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ,ట్రాఫిక్ ,లాంటి పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం ఐ డి వో సి లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను. అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ,డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పరి శీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అటవీ అధికారి జో జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమా భార్గవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే కందాళ..

తెలంగాణ వీణ/ఖమ్మం రూరల్:-

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఖమ్మం రూరల్ మండలం సింహాద్రి నగర్‌కు చెందిన దారం సుప్రియా మరణించడం పట్ల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ,ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మరియు పాలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు ఈ కార్యక్రమంలో రూరల్ మండలం అధ్యక్షులు బెల్లం వేణు, మండల నాయకులు నారపాటి రమేష్, 32 వ డివిజన్ బి ఆర్ఎస్ యువజన నాయకుడు దాట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# సామాన్యుడికి అండ కమ్యూనిస్టు జెండా

తెలంగాణ వీణ/ఖమ్మం రూరల్:-

ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 31 వ వార్డు లో అనుముల వెంకటయ్య, 32 వ వార్డులో బద్దల లింగమ్మ గార్లకు గతంలో అనారోగ్యం తో హాస్పిటల్లో చికిత్స కొరకు వారు ఖర్చు చేసిన బిల్లును సేకరించి ఖమ్మం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దండి సురేష్ గారి సహకారంతో పాలేరు నియోజకవర్గ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సిఫారసుతో అనుముల వెంకటయ్య గారికి 60 వేల రూపాయలు, బద్దల లింగమ్మ గారికి 17500 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించడం జరిగింది, ఏ సామాన్యుడికి ఎటువంటి కష్టం వచ్చినా సిపిఐ పార్టీ సహాయ సహకారాలు అందించడంలో వారి కష్టాల్లో తోడుగా ఎప్పుడూ ఉంటుంది అని 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు గారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెన్నం భాస్కర్, మామిడి సుదర్శన్ రెడ్డి, 31 వ వార్డు కార్యదర్శి దొంతగాని వెంకన్న, సహాయ కార్యదర్శి మేళచెరువు రవి,మిడకంటి పెద్ద వెంకటరెడ్డి, గణపారపు నాగయ్య, నంద్యాల శ్రీను, రైతు సంఘం నాయకులు గంధం రవి, బద్దల నాగయ్య, వల్లెబోయిన వినోద్ కుమార్, బద్దల బుడ్డయ్య, గణపారపు ఉపేందర్ మొదలగు వారు పాల్గొన్నారు



# అన్న ఎండ్ అప్రజావాణి కి మండల స్థాయి అధికారుల డుమ్మా...!

## సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్న వైనం.

## అధికారుల పని తీరు ఫిర్యాదుల పరంపరం.

నేలకొండపల్లి/తెలంగాణ వీణ

ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల స్థాయి ప్రజావాణిని పలు శాఖల అధికారులు అంతగా పట్టించుకోవటం లేదు. సోమవారం ' మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కి మండల స్థా యి అధికారులు డుమ్మా కొట్టారు. కింది స్థాయి సిబ్బందిని గ్రీవెన్స్ కు పంపించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. మండల వ్యవసాయాధికారి తప్ప... మిగతా శాఖల అధికారులు అంతా కూడ రాకుండా వారి సిబ్బందిని పంపించారు. మరి కొన్ని శాఖల .అధికారులు కనీసం వారు సిబ్బంది ని కూడ పంపించలేదు. మరి కొంత మంది సమయ పాలన పాటించకుండా ఏదో వచ్చామనే భావన కలిగేలానిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఆర్అండ్ అధికారుల తీరు పై ప్రతీ ప్రజావాణి లో తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని... కనీసం సమాచారం అడిగేందుకు జేఈ అధికారి కూడ రావటం లేదని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన పాగర్తి సుధాకర్ అధికారుల కు ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, తిరుమలాపురం పంచాయతీల రహదారి డివైండర్ మధ్యలో వేసిన లైట్లు వెలగటం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కనీసం లైట్ల ను పంచాయతీలకు అప్పగించిన నిర్వహాణయిందా బాధ్యత పంచాయతీలు వారు చూసుకుంటారని వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయం ను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. వివిధ సమస్యల పై దరఖాస్తులు అందించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



# ఆర్టిసి ఎన్నికల్లో ఈయు కూటమిని గెలిపించండి

## సిపిఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు

తెలంగాణ వీణ ఖమ్మం బ్యూరో

ఖమ్మం : ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ, ఏఐటియుసి -నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, టీఎంయు (థామస్ రెడ్డి) -యూనియన్లకు చెందిన రాష్ట్ర నాయకులు ఖమ్మం డిపోలో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం రీజియన్లో ఎంప్లాయీస్ యూనియన్, -ఎన్ఎంయు, టిఎంయు కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో -వైఫల్యం చెందిందని కార్మికుల డిమాండ్లు నెరవేరాలంటే ఖమ్మం రీజియన్లో ఎన్ఎంయు కాగడ గుర్తుకు, రాష్ట్ర గుర్తింపుకు సంబంధించి బస్సు గుర్తుకు ఓటేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్టిసి కార్మికులను మోసం చేసిన అశ్వద్ధామరెడ్డి మరోసారి మోసం చేసేందుకు సిద్దమయ్యారని ఆ మోసాలను కార్మికులు తిప్పికొట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి -సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఎంప్లాయీస్ -యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు, తెలంగాణ మద్దూర్ యూనియన్ నాయకులు థామస్ రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎండి మౌలానా, ఏఐటియుసి, సిపిఐ నాయకులు ఎస్ కె జానిమియా, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, గాదె -లక్ష్మి నారాయణ, ఏనుగు గాంధీ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాటి అప్పారావు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి/తెలంగాణ వీణ

అంగన్వాడీ కేంద్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కవిత సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం లో సోమవారం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రసన్న వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు...అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం ను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండా రంగయ్య. ఉప సర్పంచ్ రాసాల నవీన్, అంగన్వాడీ టీచర్స్ కల్పన, ఉమారాణి, విజయలక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని మంగాపురం లో సీమంతాలు. అక్షరాభ్యాసం కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సర్పంచ్ 'ధీరావత్ అశోక్ రాణి, సూపర్ వైజర్ పార్వతీ తదితరులు పాల్గొన్నారు.



# ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

## - దాడులను తీవ్రంగా ఖండించిన రమణ శర్మ-ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్

తెలంగాణవీణ, హైదరాబాద్ :

రాష్ట్రంలోని దేవాలయాలు, ఆలయాల్లోని విగ్రహాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రమణ శర్మ తెలిపారు. ఆలయాలు కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి, మనోభావాలకు ప్రతీకలని, వాటిపై విద్రోహ చర్యలకు పాల్పడటం ప్రజల భావోద్వేగాలను తీవ్రంగా దెబ్బతీయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఆలయాలపై దాడుల ఘటనల పట్ల ప్రభుత్వం, పోలీస్ శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న బాధ్యులను క్షుణ్ణంగా దర్యాప్తు చేసి వెంటనే గుర్తించాలని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పునరావృతం కాకుండా ప్రతి ఆలయం వద్ద భద్రతను పటిష్టం చేయడంతో పాటు, అవసరమైన అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ నిఘా కొనసాగించాలన్నారు.దేవాలయాలు రాజకీయాలకు అతీతమైన పవిత్ర ప్రదేశాలని, ప్రతి ఒక్కరూ ఇతరుల మత విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత ఉందని రమణ శర్మ పేర్కొన్నారు. ఆలయాలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులపై ఉక్కుపాదం మోపుతూ భక్తులకు భద్రతపై స్పష్టమైన భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



తెలంగాణవీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ,
లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# సమయానుగుణంగా విద్యార్థులకు బస్ సర్వీస్లు నడపాలి

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి..

ఏ.ఐ.ఎస్.ఎఫ్ బుర్ర మనోజ్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం కి వినతి.

తెలంగాణ వీణ ఖమ్మం బ్యూరో

ఖమ్మం:- విద్యార్థులు విద్యార్థినిలు కళాశాల నుంచి రాకముందే ఆర్టీసీ బస్సులు సమయానికి ముందే వెళ్ళడం వలన దూర ప్రాంతానికి వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని. అదేవిధంగా విద్యార్థుల సంఖ్య అనుగుణంగా బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్ ఆర్టీసీ డిపో మేనేజర్ ని కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఏన్కూర్ మండల సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ గౌతమికి ,వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూర మనోజ్ మాట్లాడుతూ. విద్యార్థులకు అనుగుణంగా బస్ సర్వీస్ వేళలను మార్చాలని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడపాలని అన్నారు. ఏన్కూరు మండల కేంద్రం నుండి ఆయా ఆయా గ్రామాలకు సమయానికి ఆర్టీసీ బస్ సర్వీసులు లేకపోవడం వలన ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి ఏన్కూర్ తిమ్మరపేట, ముచ్చర్ల మీదుగా ఖమ్మం వెళ్లే బస్సు సర్వీసులను బస్ సర్వీసు వేళలని మార్చాలని. అన్నారు సాయంత్రం 4:30 గంటలకు ఆర్టీసీ బస్సు ఏన్కూర్ సెంటర్లో ఉండే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్ సర్వీసుల వేళలతో పాటు, అదనపు సర్వీసులు నడపాలని ఆయన కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివ మనోహర్ జిల్లా సహాయ కార్యదర్శి సాయి. జిల్లా సమితి సభ్యులు కోటి. ఈశ్వర్. ఏన్కూర్ మండల సమితి నాయకులు ఉదయ్ సాయిరాం సాయికుమార్ కిరణ్ హరిప్ తదితరులు పాల్గొన్నారు...




# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి...

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశం...

తెలంగాణవీణ, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, వారి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. అంతేకాకుండా, స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై శాఖాపరంగా తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పౌరసరఫరాలు (సివిల్ సప్లైస్), మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరం

తెలంగాణ వీణ ఖమ్మం బ్యూరో



ఖమ్మంలో 'జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఎముకల వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 83 మంది ఎముకల సంబంధిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో అందించిన ఉచిత సేవలు: ఎక్స్-రేలు: 34 బీఎండీ (ఎముకల సాంద్రత) పరీక్షలు: 49 యూరిక్ యాసిడ్ పరీక్షలు: 49 ఈఎస్ఆర్ (జూ=) పరీక్షలు: 8ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సునీల్ కుమార్ జంగాల మాట్లాడుతూ.. 2017 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నాడు స్థాపించబడిన ఈ సంస్థ ద్వారా నిరంతరం కాలేయ రక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెపటైటిస్-బి పట్ల అప్రమత్తంగా ఉండటం ద్వారా కాలేయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక ముప్పుల నుండి రక్షణ పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ఫౌండేషన్ వైద్య శిబిరాల ద్వారా సమాజంలో ఆరోగ్య చైతన్యం నింపుతోందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో ఎలకల కలకలం....!

## 10 మంది విద్యార్థుల కు కాటు.. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు.

## పీడీఎస్ యు ఆధ్వర్యంలో ధర్నా.





నేలకొండపల్లి/తెలంగాణ వీణ

గురుకులంలో విద్యార్థినులకు భద్రత కరువైంది...10 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన కలకలం రేపింది. ఉపాధ్యాయులు స్పందించి వెంటనే ప్రభుత్వ హస్పిటల్ లో వైద్య పరీక్షలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పీడీఎసు నాయకులు గురుకుల పాఠశాలలో ధర్నా నిర్వహించారు. నేలకొండపల్లి మండలం . లోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల లో ఎలకల కలకలం రేపాయి. పదో తరగతి చదువుతున్న 10 మందివిద్యార్థినులను శనివారం రాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలకలు కరిచినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. పదో తరగతి చదువుతున్న లిఖిత, లాస్య, శర్మిళ, రజిని, గీతిక, సానియా, సాయిపూర్విత, పుణ్యవతి, జ్యోషిక, వెన్నల అనే విద్యార్థినులను కరిచాయి. వీరికి ఆదివారం నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్యం ను అందించారు. గురుకుల సంస్థ డిప్యూటీ సెక్రటరీ అరుణకుమారి, జోనల్ ఆఫీసర్ అపూర్వ లు పాఠశాల ను సందర్శించారు. ఘటన పై ప్రిన్సిపాల్ విజయకుమారి ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో పారిశుద్ధ్యం లోపం కారణంగా ఎలుకలు సంచరిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ హస్పిటల్ వైద్యాధికారిడాక్టర్ అర్జున్ గౌతమ్ ప్రత్యేక వైద్య శిభిరం ను నిర్వహించారు. అయితే ఎలకలు కరిచిన విషయం ను విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవటంతో నాయకులు అగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పీడీయసు నాయకులు గురుకుల పాఠశాలలో ధర్నా నిర్వహించారు. విద్యార్థినులను పరా మర్శించి... ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ తో వాదన కు దిగారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, గురుకుల ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకుల జిల్లా అధికారులు పర్యవేక్షణ లేకపోవటం వలనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. తల్లి దండ్రులకు సమాచారం ఇవ్వకపోవటం పై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు, మురళీకృష్ణ, సుశాంత్, త్రినాధ్. భాను, ప్రవీణ్బాలు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకానికి మహిళల నీరాజనాలు...

## గత 3 నెలల్లో అదనంగా 97.20 లక్షల మంది ప్రయాణం

## రద్దీకి అనుగుణంగా ట్రిప్పులు, బస్సుల సంఖ్య పెంపు - టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి

తెలంగాణవీణ, హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ఊతమిస్తున్న ఈ పథకం ద్వారా ప్రయాణించే వారి సంఖ్య రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతోందని టీజీఎస్ ఆర్టీసీ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది (2025)తో పోలిస్తే 2026 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల త్రైమాసికంలో రికార్డు స్థాయిలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. 2025 ఇదే త్రైమాసికంలో 34.67 కోట్ల (3,467.91 లక్షల) మంది మహిళలు ప్రయాణించగా, 2026 నాటికి ఆ సంఖ్య 35.65 కోట్లకు (3,565.11 లక్షలు) చేరుకుంది. కేవలం ఈ మూడు నెలల వ్యవధిలోనే గత ఏడాదితో పోల్చితే అదనంగా 97.20 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారు.

**ప్రధాన మార్గాల్లో ట్రిప్పుల పెంపు:**

పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఎప్పటికప్పుడు స్పందిస్తూ బస్సులు, ట్రిప్పుల సంఖ్యను పెంచుతోంది. ముఖ్యంగా ఖమ్మం--ఇల్లందు, ఇల్లందు--కొత్తగూడెం, ఖమ్మం- -మధిర, సూర్యాపేట--ఖమ్మం, కరీంనగర్--హుస్నాబాద్, కరీంనగర్--గోదావరిఖని/మందమర్రి, హన్మకొండ--కరీంనగర్, సంగారెడ్డి--హన్మకొండ, నల్గొండ--దేవరకొండ మార్గాల్లో అదనపు ట్రిప్పులు నడుపుతున్నారు. అదేవిధంగా రాజధానిని కలిపే సిద్దిపేట--జేబీఎస్, నాగర్‌కర్నూలు--హైదరాబాద్, కోస్టి--హైదరాబాద్‌లతో పాటు నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, దక్షిణ తెలంగాణ రీజియన్లలోనూ భారీగా సర్వీసులను పెంచారు.

**రాబోయే పండుగలకు ప్రత్యేక సర్వీసులు: ఎండీ వై. నాగిరెడ్డి**



మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఆదరణ నిరంతరం పెరుగుతోందని టీజీఎస్ ఆర్టీసీ వీసీ ఒ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో డిపో మేనేజర్లు, అధికారులు ఎప్పటికప్పుడు రద్దీని సమీక్షిస్తూ అదనపు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. రాబోయే పండుగల సీజన్లలో మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన స్పష్టం చేశారు.

# రాంపల్లి డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాల తొలగింపు ప్రారంభం...

## రామ్‌కీ సంస్థ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్న అధికారులు...

తెలంగాణవీణ, కీసర :

రాంపల్లి డంపింగ్ యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల తొలగింపు పనులు సోమవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. డంపింగ్ యార్డు వల్ల ఎదురవుతున్న సమస్యలపై స్థానిక పౌరులు, ప్రజాప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులపై ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ స్పందించి రామ్‌కీ సంస్థ అధికారులను ఆదేశించడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.వ్యర్థాల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అధికారులు రామ్‌కీ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా యుద్ధప్రాతిపదికన వ్యర్థాలను తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎంఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం, రాంపల్లి డంపింగ్ యార్డు ప్రాంగణంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. దీని ద్వారా రోజువారీగా సేకరించే ఘన వ్యర్థాలను అదే రోజున శాస్త్రీయ పద్ధతిలో స్వీకరించి, పూర్తిగా మూసివేసిన వాహనాల ద్వారా నేరుగా ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలిస్తారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలోదారి తప్పుతున్న మైనారిటీస్ గురుకులాల లక్ష్యం, స్ఫూర్తి

**-అంతటా ఆరాచకం. టిమిరీస్ వ్యవస్థ అతలాకుతలం.-చట్టం రాజ్యాంగం బైలా కు విరుద్ధంగా చర్యలు అనర్హులకు అందలం.**

**-నాడు. నేడు. షఫీ ఉల్లాదే రాజ్యం. - ప్రముఖ విద్య వేత్త మొహమ్మద్ అసద్**

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం:-ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మైనారిటీస్ గురుకులాల లక్ష్యం, స్ఫూర్తి దారి తప్పుతున్నాయని, అంతట ఆరాచకమే, టిమిరీస్ వ్యవస్థ అతలాకుతలమవుతుందని, ఇక్కడ చట్టం, రాజ్యాంగం మరియు బైలాకు విరుద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని, నాడు టీఆర్ఎస్ (బీఆర్ఎస్)ప్రభుత్వ హాయంలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సైతం ఒకే ఒక్కడు షఫీ ఉల్లా దే రాజ్యం అయిందని, ఆయన ఆడిందే ఆటగా, పాడిందే పాటగా ఒక విధమైన నిరంకుశ విధానాలు అమలవుతున్నాయంటూ ప్రముఖ విద్యా వేత్త, న్యాయ నిపుణులు మొహమ్మద్ అసద్ తీవ్రంగా ఆరోపణలు చేశారు. ముందుగా తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సంఘం (టి.ఎం.ఆర్.ఇ.ఐ.ఎస్ -- టిమిరీస్) నేపథ్యాన్ని గమనిస్తే విషయం అర్థం అవుతుందని తెలిపారు. ఆయన మాటలలోనే తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సంఘం (టీఎంఆర్ఈఐఎస్), టీమ్రీస్ రిజిస్ట్రేషన్ నెంబర్ 139/2016. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం చెందిన అనంతరం ముస్లిం స్థితిగతులపై అధ్యయనకి ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం సుధీర్ కమిషన్ను ఏర్పాటు చేసింది. మార్చి 3, 2015 లో ఈ కమిషన్ నియామకం జరగగా, రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల పర్యటించి సర్వ నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించి అనంతరం ఆగస్టు 2016లో రాష్ట్ర ప్రభుత్వానికి సుధీర్ కమిషన్ తన 300 పేజీలుగా నివేదికను సమర్పించింది. అనంతరం అదే సంవత్సరం డిసెంబర్ మాసంలో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిషన్ నివేదికను బహిర్గత పరిచింది. కమిషన్ సిఫార్సు చేసిన దాని ప్రకారం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి గాను 12 శాతం గరిష్టంగా రిజర్వేషన్లు ఇవ్వాలని లేదా కనిష్టంగా 9 శాతం రిజర్వేషన్లైనా అమలు చేయాలని సూచించింది.

### ఉపప్రణాళిక (సబ్ ప్లాన్)

ఎస్సీ ఎస్టీల తరహాలో ముస్లింలకు కూడా ప్రత్యేక తరహాలు ఉపప్రణాళికను అమలు చేయాలని కూడా సూచించింది.
1.ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు విద్యాబుద్ధులు కూడా చెప్పించాలని సిఫారసు చేసింది.
2.ముస్లిం మైనార్టీ విషయంలో పాఠశాల స్థాయిలో డ్రాప్ అవుట్స్ అధికంగా ఉందని, దీనిపై దృష్టి సారించిన నాటి ప్రభుత్వం పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకుగాను గురుకులాల వ్యవస్థను తీసుకుని వచ్చింది. సుధీర్ కమిషన్ సిఫారసు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మైనార్టీస్ గురుకులాల విద్యా సంస్థల సంఘాన్ని (టి ఎమ్ ఆర్ ఈ ఐ ఎస్) టీమ్రీస్ ను ఏర్పాటు చేసింది. ఆ నాటి ప్రభుత్వ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్, ఈ సంఘం ను 28 అంశాలతో... ఒక బైలాను ఏర్పాటు రిజిస్టర్ చేశారు.

### బైలా స్వరూపం

బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ను ఏర్పాటు చేయాలని, బైలాలో ఐదవ నెంబర్ లో పేర్కొన్నారు. దీని అనుసరించి ఉపముఖ్యమంత్రి చైర్మన్ గా, రెవెన్యూ మంత్రి ముఖ్య



సలహాదారుడిగా ఉంటారు. వైస్ చైర్మన్ / ప్రెసిడెంట్ గా,ఎక్స్ అఫీషియో, ప్రభుత్వ పదవీ విరమణ చేసిన ఐఏఎస్ ఐపీఎస్ ఐఎఫ్ఎస్ వంటి ఉన్నతాధికారులను నియమించాలి. కాగా అప్పట్లో ఏకే.ఖాన్ (ఐపీఎస్)ను నియమించారు.
ఏడుగురు సభ్యులు
1.ప్రిన్సిపల్ సెక్రటరీ లేదా ప్రత్యేక కార్యదర్శి, (విద్యాశాఖ నుండి)
2.మైనార్టీ శాఖ నుండి,
3.ఫైనాన్స్ నుండి ప్రభుత్వ కార్యదర్శి లను నియమించాలి.
4.ప్రభుత్వ శాఖలలో ఏదైనా గాని ఒక కార్యదర్శిని,
5.బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుండి ఒక సెక్రటరీని ప్రత్యేక ఆహ్వానితుడిగా,
6.డీఎస్సీ నుండి మరొకరిని ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించాలి.
7.విద్యావ్యవస్థలలో నిపుణుడైన వ్యక్తిని నియమించాలి.
ఇదిలా ఉండగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బైలాకు విరుద్ధంగా మూడవ నెంబర్ లో రాజకీయ నేపథ్యం గల ఫహీమ్ ఖురేషిని ఎంపిక చేయడం విడ్డురంగా ఉంది.ఈ స్థానంలో ఎక్స్ అఫిసియో సభ్యుడై ఉండాలి. ఫహీమ్ ఖురేషిని నియమించిడం రాజ్యాంగ, చట్ట బద్దంగా బైలాకు వ్యతిరేకంగా ఉన్న విధానాలను తుంగలో తొక్కి రాజకీయ నేపథ్యం ఉన్న ఖురేషిని నియమించారు. తద్వారా ఈ వ్యవస్థ లక్ష్యం, స్ఫూర్తి దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇది బైలాకు మాత్రమే కాకుండా రాజ్యాంగానికి, 139 / 2016 రిజిస్ట్రేషన్ స్ఫూర్తి కి, చట్టానికి కూడా ఇది విరుద్ధం.గత 2016వ సంవత్సరంలో ఐదవ తరగతి బాలురు బాలికలు కోసం ప్రత్యేక వసతి ఏర్పాట్లతో మైనార్టీలకు పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ మొదటి బ్యాచ్ పదవ తరగతి దాటిన తర్వాత జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. ఇలా లక్ష్యంగా పెట్టుకున్నారు. పేదలలో కెల్లా పేదవాడికి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం లక్ష్యంగా ఈ టిమిరీస్ వ్యవస్థను రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఆ లక్ష్యం గాడి తప్పింది. కారణం. షఫీ ఉల్లా (ఐఎఫ్ఎస్). ఈ వ్యవస్థ కు మొట్టమొదటి కార్యదర్శి హోదాలో నియమితులై పనిచేశారు. తన పదవి కాలంలో ఆయన అనేక రాజ్యాంగ చట్టవిరుద్ధ ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో తొలగించారు. తదనంతరం మసరత్ ఖాన్ (ఐఏఎస్), ఆ తర్వాత తప్సీర్ ఇక్బాల్ (ఐపీఎస్)లు కూడా కార్యదర్శులుగా నియమితులై విధులు నిర్వహించారు. తదనంతర కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మరోసారి ఈ కార్యదర్శి పదవిలో షఫీ ఉల్లాను నియమించారు. రాజ్యాంగం - చట్ట విరుద్ధ ఉల్లంఘనలు:ఈ మైనార్టీస్ గురుకులాల వ్యవస్థలో బైలా కు విరుద్ధంగా మాత్రమే కాకుండా రాజ్యాంగ పర, చట్టపర ఉల్లంఘనలకు పాల్పడుతూ, కాంట్రాక్ట్- ఔట్ సోర్సింగ్ విధానానికి సర్వహక్కులు కట్టబెట్టారు. తనకు నచ్చిన, తాను మెచ్చిన ఏజెన్సీలకు ఆయన బై లాకు విరుద్ధంగా కాంట్రాక్ట్ లు ఇచ్చుకుంటూ పోయారు. కొన్నిసార్లు కొన్ని అంశాలలో ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సిన సందర్భంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ముందుకెళ్లారు.

### అకాడమీ కన్సల్టేషన్:

ఒక సాధారణ మాంటీసోరీ టీచర్ అయినటువంటి సాదియా అలా ఉద్దీన్ అనే మహిళకు ఈ మైనార్టీ గురుకులాల హెడ్ గా నియమించారు. మామూలుగా టీఎస్పీఎస్సీ (తెలంగాణ రాష్ట్ర పబ్లి సర్వీస్ కమీషన్) ద్వారా ఎంపికైన ఈ గురుకులాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులపై కేవలం ఔట్ సోర్సింగ్ ద్వారా ఎన్నిక చేసినటువంటి ఈ మాంటిసోరి టీచర్ సాదియా అలా ఉద్దీన్, ఈ ప్రినిపాల్, ఉపాధ్యాయులపై పెత్తనం చేయడం గమనార్హం.జూనియర్ కళాశాలల ఇన్ చార్జ్ గా బి.శ్రీనివాస్ రావుఈ విధమైన ఒక ముఖ్యమైన పదవిలో కొనసాగుతున్న బి.శ్రీనివాస్ రావును కూడా టీఎస్ పీఎస్సీ నుంచి ఎంపిక చేయకుండా కాంట్రాక్ట్ బేసిక్ లో నియమించారు. ఈ విధమైన చర్యలు గురుకుల వ్యవస్థలో మరో సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసి నడుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.హెల్పింగ్ హ్యాడ్ ఫౌండేషన్ (హచ్ఎచ్ఎఫ్)సాధారణంగా ప్రతీ గురుకులానికి ఒక స్టాఫ్ నర్సును నియమిస్తుంటారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగిగానే వ్యవహరిస్తూ, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను పరిరక్షించడం చేస్తుంటారు. ఇబ్బంది ఏదైనా తలెత్తితే వెంటనే బస్తీ దవాఖానాలకు, పీహెచ్ సీలకు లేకుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించాలి. ఇక్కడ షఫీ ఉల్లా, హెల్పింగ్ హ్యాడ్ అనే సంస్థకు ఈ విషయంలో కాంట్రాక్టులు ఇచ్చారు. ఈ సంస్థ ఈ స్టాఫ్ నర్సులపై పెత్తనాన్ని చలాయిస్తుంది. ఇది కూడా గతంలో పేర్కొన్నవాటికి ఉల్లంగనే అంటూ ప్రముఖ విద్యావేత్త, న్యాయన్నిపుణులు మహమ్మద్ అసద్ తన ఆరోపణలు, విమర్శలను గుప్పించారు.
( మిగతా కథనం.
మరోసారి.. )

# భజరంగ్ కాలనీలో రూ. 34 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం..

**నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి..**

తెలంగాణవీణ,జవహర్‌నగర్:

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భజరంగ్ కాలనీలో రూ. 34 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. కాలనీలో దాదాపు 430 మీటర్ల మేర నిర్మించనున్న ఈ రహదారి పనులకు మాజీ మేయర్ , విజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాలనీలలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి, ప్రజల రాకపోకల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో కాలనీవాసులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డు నిర్మాణాన్ని మంజూరు చేయించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు ఎక్కడా రాజీ పడకుండా పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు శ్వేతా ముకేశ్, శోభారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి మనోహర్ రెడ్డి, భజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రాసేన రావు, రాజేష్, గడ్డం శ్రీనివాస్, ఉపేందర్, అంగడి బాలరాజ్, నరేష్, అంగడి కృష్ణ, సుబ్బారావు ,కాలనీవాసులు పాల్గొన్నారు.



# 420 హామీలతో గద్దెనెక్కి.. మూడేళ్లవుతున్నా అమలు ఏదీ?

**ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలి... భూక్య అనిల్ నాయక్**

తెలంగాణవీణ, హైదరాబాద్ :



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బీజేపీ నాయకుడు భూక్య అనిల్ నాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో అసాధ్యమైన 420 హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గద్దెనెక్కి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన మాటలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆయన మండి పడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్, అమలు విషయానికి వచ్చేసరికి తీవ్ర జాప్యం చేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని గుర్తుచేశారు. యువతకు ఉద్యోగాల కల్పన, రైతులకు భరోసా, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, పేదలకు సంక్షేమ ఫలాల అందజేత వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో ముందుకు రావాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇక కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మే స్థితిలో లేరని, క్షేత్రస్థాయిలో ఫలితాలను కోరుకుంటున్నారని అనిల్ నాయక్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను తక్షణమే అమలు చేసి చూపించాలని, ప్రజల సహనాన్ని పరీక్షించకుండా ప్రభుత్వం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని హితవు పలికారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలు, హామీలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జల్లి--మాధవనగర్ రహదారిపై సమగ్ర సర్వే చేయాలి.

**-50 ఏళ్లుగా ప్రజల వినియోగంలో ఉన్న దారి హక్కులు, హద్దులు, రికార్డులను అధికారికంగా నిర్ధారించాలి.-150 మంది రైతుల డిమాండ్**

తెలంగాణ వీణ చెన్నారావుపేట/జల్లి

జల్లి--మాధవనగర్ వ్యవసాయ రహదారికి సంబంధించిన సమస్యపై సమగ్ర సర్వే నిర్వహించి రహదారి హక్కులు, హద్దులు, రికార్డులను అధికారికంగా నిర్ధారించాలని 150 మంది రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం కేవలం 17 రోజుల్లోనే స్పందించి సంబంధిత అధికారులతో విచారణ, క్షేత్రస్థాయి పరిశీలనకు చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సంబంధిత అధికారులకు, ప్రజా నాయకులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ శాఖ, ల్యాండ్ సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో రహదారిని పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి తిమ్మారావుపేట శివారు పరిధిలో ఉన్నట్లు గుర్తించినప్పటికీ, సంబంధిత నక్షత్రం/మ్యాప్ రికార్డుల్లో రహదారి స్పష్టంగా కనిపించకపోవడం కీలక అంశంగా ఉందని రైతులు తెలిపారు. 50 ఏళ్ల రహదారి.. రాకపోకల హక్కును పరిశీలించాలి. జల్లి--మాధవనగర్ రహదారి 50 సంవత్సరాలకు పైగా రైతులు, గ్రామ ప్రజలు నిరంతరంగా వినియోగిస్తున్న పాత రాకపోకల దారిగా ఉందని రైతులు పేర్కొన్నారు. కేవలం ప్రస్తుతం ఉన్న ఒక రెవెన్యూ రికార్డును ఆధారంగా చేసుకుని దారి స్థితిని నిర్ణయించకుండా, దీర్ఘకాలంగా ప్రజలు వినియోగిస్తున్న నేపథ్యంలో చట్టపరమైన రైట్ ఆఫ్ వే (రాకపోకల హక్కు) అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.భారత ఝుంవఎవత్ీం ాూవ్ష్, 1882లోని ావవ్ఔశీఅ 15 ప్రకారం నిర్దిష్ట పరిస్థితుల్లో ఒక దారిని దీర్ఘకాలంగా, బహిరంగంగా, నిరంతరంగా, హక్కుగా ఉపయోగించడం ద్వారా ఏర్పడే ఝుంవఎవత్/తీఅస్త్రష్ట్ర శీట ఝుఎ అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని రైతులు తెలిపారు. అయితే దీనివల్ల భూమి స్వయంచాలకంగా ప్రభుత్వ భూమిగా మారదని, రహదారి యాజమాన్యం, ప్రభుత్వ భూమి స్థితి, ప్రజల రాకపోకల హక్కు వంటి అంశాలను విడివిడిగా రికార్డులు, సర్వే, చట్టపరమైన ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు.

### పాత రికార్డులన్నీ పరిశీలించాలి




రహదారి 50 ఏళ్లకు పైగా వినియోగంలో ఉన్నందున పాత వినియోగ చరిత్రతో పాటు గ్రామ మ్యాప్‌లు, ఎఫ్ఎంబీ, అడంగల్, పహాణి, కాస్తు పహాణి, గ్రామపంచాయతీ రికార్డులు, గతంలో జరిగిన ప్రభుత్వ పనులకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. లొకేషన్ మ్యాప్, జీపీఎస్ ఆధారంగా రహదారిని ప్రారంభం నుంచి ముగింపు వరకు పూర్తిస్థాయిలో సర్వే చేసి, రహదారి ఏయే సర్వే నంబర్ల మీదుగా వెళ్తోంది, ఇరువైపులా ఉన్న రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, రహదారి పొడవు--వెడల్పు, మొత్తం విస్తీర్ణం, తూర్పు--పడమర, ఉత్తర--దక్షిణ హద్దులను అధికారికంగా గుర్తించి మ్యాప్‌లో నమోదు చేయాలని కోరారు.అవసరమైన ప్రాంతాల్లో శాశ్వత బౌండరీలు, ఫిక్స్‌డ్ పాయింట్లు ఏర్పాటు చేసి భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా రహదారి హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో పనులు జరిగితే రికార్డులు బయటపెట్టాలి. గతంలో ఈ రహదారిపై ఉపాధి హామీ పథకం, గ్రామపంచాయతీ లేదా ఇతర ప్రభుత్వ నిధులతో పనులు జరిగి ఉంటే, వాటికి సంబంధించిన మంజూరు పత్రాలు, అంచనాలు, ఎం.బీ లు, బిల్లులు, ఇతర ప్రభుత్వ రికార్డులను పరిశీలించాలని రైతులు కోరారు. రహదారి రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా లేకపోయినా ప్రభుత్వ పనులు ఏ ఆధారంతో మంజూరయ్యాయో కూడా అధికారులు వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.రైతులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.50 సంవత్సరాలకు పైగా ప్రజల వినియోగంలో ఉన్న రహదారి వాస్తవంగా ఉన్నప్పటికీ సంబంధిత మ్యాప్‌లు, రికార్డుల్లో ఎందుకు కనిపించడం లేదు? గతంలో ప్రభుత్వ నిధులతో పనులు జరిగి ఉంటే ఏ రికార్డుల ఆధారంగా జరిగాయి? రహదారి అసలు హద్దులు ఏమిటి? రైతులకు ఉన్న రైట్ ఆఫ్ వే ఏమిటి? అనే అంశాలపై అధికారులు సమగ్ర సర్వే, అధికారిక రికార్డుల ఆధారంగా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని 150 మంది రైతులు కోరారు. వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి వచ్చే వరకు రైతుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు అనవసరమైన అంతరాయం లేకుండా సర్వే--రికార్డుల పరిశీలన--హద్దుల నిర్ధారణ ప్రక్రియను పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సర్వే నిర్వహించిన పంచాయతీరాజ్ శాఖ, ల్యాండ్ సర్వే అధికారులు, ప్రభుత్వ అధికారులు, ప్రజా నాయకులు, మీడియా మిత్రులకు 150 మంది రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."రైతులకు న్యాయం -- రహదారికి శాశ్వత హక్కు -- రికార్డుల్లో పూర్తి పారదర్శకత" అనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ అంశంపై తుది పరిష్కారం చూపాలని రైతుల తరపున కాట కుమారస్వామి కోరారు.

# గుంతేటి వీరభద్రంకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

తెలంగాణ వీణ ఖమ్మం బ్యూరో

ఖమ్మం: సామాజిక ఉద్యమ నేత, మాల మహానాడు సీనియర్ నాయకులు గుంతేటి వీరభద్రం 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, మాల మహానాడు నాయకులు కరాటే వేణు, జమ్మి వీరబాబు తదితరులు గుంతేటి వీరభద్రంను కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గుంతేటి వీరభద్రం ఎన్నో సంవత్సరాలుగా సామాజిక ఉద్యమంలో క్రియాశీలకంగా ఉంటూ సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్‌లోనూ మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. గుంతేటి వీరభద్రం నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవిస్తూ మరిన్ని సంవత్సరాలు సామాజిక సేవలో ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.



# అక్టోబర్ 15న 'జైలర్ 2'

సూపర్‌స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'జైలర్ 2' సినిమా మరో పది రోజుల్లో థియేటర్లలోకి రానుంది. రజనీకాంత్ కథానాయకుడిగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న మూవీ ఇది. బ్లాక్ బస్టర్ 'జైలర్' సీక్వెల్ గా రూపొందుతోంది. దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ను లాంచ్ చేశారు.'జైలర్' కథ ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే 'జైలర్ 2' కథ ప్రారంభం అవుతుంది. మొదటి భాగానికి మించి ఉండేలా, భారీ స్థాయిలో స్టార్ కాస్టింగ్ తో ఈ సీక్వెల్ రూపొందించారు. ఇందులో టైగర్ ముత్తువేల్ పాండియన్ గా రజనీకాంత్ తిరిగొచ్చారు. ఆయన భార్యగా రమ్యకృష్ణ, కోడలిగా మిర్నా కనిపించారు. మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్జే సూర్య, సూరజ్ వెంజరమూడు, అన్నా రాజన్, యోగిబాబు, జతిన్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, జాకీ ష్రాఫ్ స్పెషల్ క్యామియో రోల్స్ చేశారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ భారీ బడ్జెట్ తో 'జైలర్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం సమకూర్చగా.. విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. నిర్మల్ ఎడిటింగ్ చేశారు. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది.




# అక్టోబర్ 9న హనుమాన్ అంశ్ తెలుగు ట్రైలర్






చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద హిస్టరీ క్రియేట్ చేసిన చిత్రం ' హనుమాన్ అంశ్ '. కేవలం రూ.2కోట్లతో తీసిన హనుమాన్ అంశ్ హిందీలో రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడీ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయింది. అక్టోబర్ 9న థియేటర్లలో రిలీజ్ కానుంది. ప్రచారంలో భాగంగా తాజాగా తెలుగు ట్రైలర్ రిలీజ్ అయింది.ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా 'హనుమాన్ అంశ్' సినిమా తెరకెక్కింది. ఇందులో శోభిత్ శ్రీవాత్సవ ప్రధాన పాత్ర పోషించారు. చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి ఇతర కీలక పాత్రల్లో నటించారు. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలుగులో రిలీజ్ చేయాలని భావించారు. కానీ చివరి నిమిషంలో ఆయన వెనక్కి తగ్గడంతో, ఓవర్ సీస్ లో రిలీజ్ చేసిన హోంబలే ఫిల్మ్స్..ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడానికి ముందుకొచ్చింది. హిందీలో ప్రభంజనం సృష్టించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.

# ఆదర్శ కుటుంబం రిలీజ్ వాయిదా..




విక్టరీ వెంకటేష్, శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య బ్రహ్మాజీ నటించిన చిత్రం ఆదర్శ కుటుంబం. ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్ రాధాకృష్ణ నిర్మించారు. శ్రీమతి మమతా సమర్పించారు. ఈ సినిమా సాంకేతిక విభాగాల వివరాల్లోకి వెళితే.. మ్యూజిక్: ఎస్ తమన్, సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్, ఎడిటర్: నవీన్ నూలీ, ఆర్ట్ డైరెక్టర్: ఏఎస్ ప్రకాశ్, స్టంట్స్: కెవిన్ కుమార్ తమ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సినిమా అక్టోబర్ 9వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. కానీ ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్టు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఆదర్శ కుటుంబం సినిమా గురించిన సర్‌ప్రైజ్‌లు ఏమీ చెప్పడం లేదు. రాత్రి నుంచి మాపై సోషల్ మీడియాలో వేసుకొంటున్నారు. నాలుగు రోజుల క్రితమే తప్పకుండా రిలీజ్ అవుతుందని చెప్పాం. కానీ ఆదివారం ఉదయం వరకు 4, లేదా 5 రోజులు ల్యాగ్‌లో ఉన్నాం. అప్పటికీ సినిమా తీసుకు రావొచ్చని అనుకొన్నాం. కానీ ఫ్రైడ్ మార్నింగ్ సినిమా రిలీజ్ అయితే మేము కూడా థియేటర్లోనే చూడాల్సిన పరిస్థితి ఉంది. నిన్న మార్నింగ్ వరకు ఓవర్సీస్ మార్కెట్‌కు కంటెంట్ ఇవ్వలేకపోయాం. అందుకే ఈ సినిమా రిలీజ్ వాయిదా వేయాలని అనుకొంటున్నాం అని నాగవంశీ తెలిపారు. ఈ సినిమాను సేఫ్ ప్రాజెక్టుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ తర్వాత కూడా సినిమా నచ్చుతుందా? లేదా? అనేది వేరే విషయం. ఈ సినిమాలో ఏ ఒక్క సీన్ కూడా వేలెత్తి చూపకుండా, విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుకొన్నాం. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, ధాని వల్ల భయం వల్ల మేము సరైన ప్రాజెక్ట్ ఇవ్వలేకపోతున్నాం అని ఆయన అన్నారు. ఈ సినిమా విషయంలో ముందే జాగ్రత్త పడి ఉంటే.. అక్టోబర్ 9వ తేదీకి వేరే సినిమాలు వచ్చి ఉండేవేమో. అలా చేయలేకపోయినందుకు సారీ. వెంకటేష్ ఫ్యాన్స్ నుంచి పబ్లిసిటీ సరిపోలేదనే ఫిర్యాదు కూడా ఉంది. అలాగే తమన్ బీజీగా ఉండటంతో ట్రైలర్ కూడా రెడీ కాలేదు. నాలుగు రోజుల ముందు సినిమాను వాయిదా వేయడం సరికాదు. ఈ సినిమా విషయంలో ఏ రిస్క్ చేయకుండా.. మంచి సినిమా చూపించాలనే ప్రయత్నంలో భాగంగా ఈ సినిమాను వాయిదా వేయాలని కాల్ తీసుకొన్నాం అని నాగవంశీ అన్నారు. ఇంకా ఈ సినిమా రిలీజ్ ఎప్పుడనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వెంకటేష్ విదేశాలకు వెళ్లారు. ఆయన వచ్చిన తర్వాత సురేష్ బాబుతో కలిసి ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి ఓ నిర్ణయం తీసుకొంటాం. అక్టోబర్ 30 అనే డేట్ విషయంలో ఇంకా ఫిక్స్ కాలేదు అని ఓ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. సినిమా కంటెంట్ మీద నెగిటివిటీ రాకుండా, క్రిటిక్స్ నుంచి ఎలాంటి ట్రోల్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోన్నాం. తప్పు జరగక ముందే అలాంటివి జరగకుండా చూసుకొంటున్నాం. ఓటీటీ వాళ్లకు కూడా రిలీజ్ డేట్ వాయిదాపై రిక్వెస్ట్ చేశాం. త్వరలోనే వారి నుంచి సలహా తీసుకొంటాం. మా టీమ్ అంతా కలిసి చూసి క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాకుండా ఉన్నప్పుడే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని అన్నారు.

# చేతులెత్తి వేడుకుంటున్నా..

## నా పేరు వాడొద్దు



సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ పేరు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా ఆయనకు రాజకీయంగా కీలక పదవి దక్కబోతోందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై బండ్ల గణేష్ తాజాగా స్పందించారు. తన పేరు ఉపయోగించి లేనిపోని ప్రచారాలు చేయొద్దని, వాటి వల్ల తన వ్యక్తిగత జీవితానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి పదవులు, హోదాలపై ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తాజాగా ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. బండ్ల గణేష్ తన పోస్టులో.. 'దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను' అంటూ విజ్ఞప్తి చేశారు. తనకు ఎలాంటి పదవులు, హోదాల మీద వ్యామోహం కానీ, ఆశ కానీ లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు.. లేనిపోని విషయాలు మాట్లాడి తన పేరును ఉపయోగించడం ద్వారా తనకు ఇబ్బందులు కలిగించొద్దని కోరారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని, తన పేరు ఉపయోగించకుండా తనకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని మరోసారి చేతులెత్తి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. సాధారణంగా తనదైన శైలిలో ఘాటుగా స్పందించే బండ్ల గణేష్ ఈసారి చాలా సున్నితంగా, భావోద్వేగంతో విజ్ఞప్తి చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇటీవల బండ్ల గణేష్‌కు రాజకీయంగా ఏదైనా కీలక పదవి దక్కబోతోందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ప్రచారంపై ఆయన ఇప్పటివరకు నేరుగా స్పందించలేదు. తాజా పోస్టులో మాత్రం తనకు ఎలాంటి పదవులు, హోదాలపై ఆసక్తి లేదని ప్రత్యేకంగా చెప్పడంతో.. ఈ వ్యాఖ్యలు రాజకీయ పదవుల ప్రచారాన్ని ఉద్దేశించే చేశారా? అనే చర్చ మొదలైంది. అయితే బండ్ల గణేష్ తన పోస్టులో ఎవరినీ, ఏ ప్రచారాన్ని నేరుగా ప్రస్తావించలేదు. బండ్ల గణేష్ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. తనకు ఆత్మీయులైన వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడంతో పాటు, తనను టార్గెట్ చేసే వారికి కూడా కొటేషన్ల రూపంలో కౌంటర్లు ఇస్తున్నారు. 'నా మౌనాన్ని బలహీనత అనుకోవద్దు.. సమయం కోసం ఆగుతున్నాను' అంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో ఆసక్తి రేపారు. అలాగే కష్టాలు, పట్టుదల, నిజాయితీ, విజయం గురించి వరుస పోస్టులు చేస్తూ తనదైన శైలిలో స్పందించారు. అయితే, ఇప్పుడు మాత్రం పూర్తిగా భిన్న ధోరణిలో తన పేరు ఉపయోగించవద్దని చేతులెత్తి వేడుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజా పోస్టు చూసిన కొందరు నెటిజన్లు 'బండ్లన్నా.. ఏమైంది?' అంటూ ప్రశ్నిస్తున్నారు. మరికొందరు ఆయనకు మద్దతుగా స్పందిస్తున్నారు. ఇంకొందరు మాత్రం గతంలో ఆయన చేసిన ఘాటు పోస్టులను గుర్తు చేస్తూ కామెంట్లు చేస్తున్నారు. దీంతో బండ్ల గణేష్ తాజా పోస్ట్‌పై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి. ఇటీవల తన కుమార్తె వివాహం సందర్భంగా కూడా బండ్ల గణేష్ వార్తల్లో నిలిచారు. ఆ తర్వాత పబ్లిక్ ఈవెంట్లలో పెద్దగా కనిపించకపోయినా సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గానే ఉన్నారు. తనకు నచ్చిన విషయాలపై స్పందిస్తూ, తనను ఉద్దేశించి వచ్చే వ్యాఖ్యలకు కౌంటర్లు ఇస్తూ కనిపించారు.

# నాకు ఎవరూ ఏ గిఫ్ట్ ఇవ్వలేదు



ఐటీ సోదాల నేపథ్యంలో తన పేరును ప్రస్తావించడంపై హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందించారు. ఆ సోదాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. వాస్తవాలు తెలుసుకుని మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె అన్నారు. ఈ మేరకు ఇన్?స్టాగ్రామ్?లో సుదీర్ఘమైన స్టేట్?మెంట్ రిలీజ్ చేశారు. ఇటీవల జరిగిన ఐటీ సోదాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని రకుల్? ప్రీత్ సింగ్ తెలిపారు. 'నాది ఆర్మీ నేపథ్యం ఉన్న కుటుంబం. నేను ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. బాధ్యతాయుత పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే టాక్స్ కడుతున్నాను. వ్యక్తిగతంగా గానీ, ఏ ఇతర నిర్మాణ సంస్థ తరఫున గాని నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీల్లో పాలుపంచుకోలేదు. దేశ విదేశాల్లో ఎవరి పేరు మీద నాకు బినామీ ఆస్తులు లేవు. నాకు ఎవరూ ఎలాంటి ఆస్తులను గిఫ్ట్?గా ఇవ్వలేదు. అలాంటి కాస్ట్?లీ గిఫ్ట్?లను ఎవరైనా ఇచ్చినా సరే తీసుకోకూడదన్నది నా నియమం' అని రకుల్ ప్రీత్?సింగ్ తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కాగా, గతనెల 29న ముంబయిలో ఆమె మామ, నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే ఆ సోదాలను తనకు లింక్? చేస్తుండడంపై ఆమె తాజాగా స్పందించడం ప్రస్తుతం హాట్ టాపిక్?గా మారింది.తెలుగుతో పాటు పలు భాషల్లో వరుస సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్, నిర్మాత జాకీ భగ్నానీని 2024లో వివాహం చేసుకున్నారు. జాకీ భగ్నానీ ప్రముఖ నిర్మాత వాసు భగ్నానీ కుమారుడు. ఇక వాసు భగ్నానీ బాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందారు. ఆయన కుటుంబానికి చెందిన పూజా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ ద్వారా ఎన్నో సినిమాలు నిర్మించారు. 'హీరో నంబర్ 1', 'బీవీ నంబర్ 1', 'బడే మియా ఛోటే మియా', 'రెహ్నా హై తేరే దిల్ మే' వంటి చిత్రాల నిర్మాణంలో ఆయన భాగస్వామిగా ఉన్నారు. పనోరమా స్టూడియోస్? సంస్థ హిందీ చిత్ర పరిశ్రమలో నిర్మాణం, పంపిణీ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అజయ్ దేవగణ్ నటించిన 'దృశ్యం' చిత్రాలతో పాటు 'రైడ్', 'మిషన్ రాణిగంజ్' వంటి సినిమాలతో ఆ సంస్థకు సంబంధం ఉంది. ఇటీవల అధికారులు సంస్థకు సంబంధించిన ఆర్థిక పత్రాలు, ప్రాజెక్టులకు వచ్చిన నిధులు, ఖర్చులు, విదేశీ లావాదేవీల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే ఏయే లావాదేవీలపై అనుమానాలు ఉన్నాయనే విషయాన్ని మాత్రం అధికారులు ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు.



# మరో సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యా అవుట్

ఆస్ట్రేలియా ఎ జట్టుతో పుదుచ్చేరి వేదికగా జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత ఎ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తాజా గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరం అయ్యాడు. అతని స్థానంలో ముంబైకి చెందిన సూర్యాంశ్ షెడ్గె ఎంపికయ్యాడు. ఈ నెల 6, 9, 11 తేదీల్లో టీమిండియా ఏ- ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య ఈ మ్యాచ్ లు జరుగనున్నాయి. తన సత్తా నిరూపించుకోవడానికి షెడ్గెకు సువర్ణావకాశాన్ని లభించినట్టయింది. హార్దిక్ పాండ్యాను వరుస గాయాల బెడద వదలట్లేదు. బెంగళూరు నేషనల్ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్ టెస్ట్ సందర్భంగా అతని కుడి పిక్క భాగంలో తీవ్ర అసౌకర్యం తలెత్తింది. అనంతరం నిర్వహించిన ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతనికి మైల్డ్ ఇంట్రామెడుల్లరీ ఎడెమా సమస్య ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఫలితంగా.. రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు సైతం అతను ఎంపిక కావడం అనుమానమే. ఈ సిరీస్ కంటే ముందే పూర్తి ఫిట్‌నెస్ సాధించి జాతీయ జట్టులోకి తిరిగి రావాలనే పాండ్యా సుదీర్ఘ నిరీక్షణకు మళ్లీ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హార్దిక్ పాండ్యాతో పాటు హర్షిత్ రాణా కూడా ఇప్పట్లో కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. గాయం కారణంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో ఉంటోన్నాడీ ఫాస్ట్ బౌలర్. దీనివల్ల ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్, వెస్టిండీస్ సిరీస్ లను చేజార్చుకోవాల్సి వచ్చింది. ఆసియా గేమ్స్ కూ దూరం అయ్యాడు. ప్రస్తుతం అతని ఫిట్ నెస్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే న్యూజిలాండ్ పర్యటనకు కూడా అందుబాటులో ఉండకపోవచ్చని చెబుతున్నారు.అటు షెడ్గె కూడా కొంతకాలం పాటు గాయాలతో సతమతం అయ్యాడు. కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దేశవాళీ టోర్నీలకు దూరం అయ్యాడు. బెంగళూరులో బీసీసీఐకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో గడిపాడు. తాజాగా అతను పూర్తి ఫిట్ నెస్ సాధించడంతో బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తుది పరీక్షల అనంతరం పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు నిర్ధారణ కావడంతో నేరుగా పుదుచ్చేరిలో ఉన్న భారత-ఎ తో చేరాడు. ఈ ఏడాది ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత్ తరఫున మూడు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు సూర్యాంశ్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోనూ భారత్ 'ఎ' తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడీ ఆల్ రౌండర్. అక్కడ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి అయిదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. హార్దిక్ పాండ్యా తరహాలోనే బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణించే సత్తా అతనికి ఉంది.



# వినూ మంకడ్ ట్రోఫీలో ఆడనున్న ఆర్యవీర్ సెహ్వాగ్

టీమిండియా మాజీ విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తన ధనాధన్ బ్యాటింగ్ తో భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక ముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా తండ్రి బాటలోనే వేగంగా దూసుకొస్తున్నాడు. 18 ఏళ్ల ఈ యువ బ్యాటర్‌కు ఢిల్లీ క్రికెట్లో అరుదైన అవకాశం దక్కింది. రాబోయే ప్రతిష్టాత్మక వినూ మంకడ్ ట్రోఫీ కోసం ఆర్యవీర్ సెహ్వాగ్‌ను ఢిల్లీ అండర్-19 జట్టు కెప్టెన్‌గా నియమిస్తూ కీలక బాధ్యతలు అప్పగించారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వినూ మంకడ్ ట్రోఫీ కోసం 16 మంది సభ్యులతో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. విశాఖపట్నం వేదికగా అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో ఢిల్లీ జట్టును ఆర్యవీర్ ముందుకు నడిపించనున్నాడు. ఓ ప్రధాన జట్టుకు నాయకత్వం వహించడం ఆర్యవీర్‌కు ఇదే తొలిసారి కావడంతో ఈ నిర్ణయం ఆసక్తికరంగా మారింది. జట్టుకు అర్నవ్ బుగ్గా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.గత కొన్ని నెలలుగా ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఇటీవల రాజ్‌కోట్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో భారత అండర్-19 జట్టు తరఫున ఆడి తన సత్తా చాటాడు. వర్షం కారణంగా అంతరాయం కలిగిన తొలి మ్యాచ్‌లో 28 పరుగులు సాధించిన ఆర్యవీర్.. రెండో మ్యాచ్‌లో 47 పరుగులతో మెరిసి తృటిలో అర్ధసెంచరీ చేజార్చుకున్నాడు. ఇక మూడో వన్డేలో కూడా 34 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో భాగమయ్యాడు.అంతే కాకుండా ఢిల్లీ ప్రీమియర్ లీగ్(డీపీఎల్)లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆర్యవీర్ సెహ్వాగ్.. అంతకుముందు కూచ్ బెహార్ ట్రోఫీలో మేఘాలయపై ఏకంగా 297 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడి క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించాడు. నాయకుడిగా, బ్యాటర్‌గా వినూ మంకడ్ ట్రోఫీలో తన ముద్ర వేసేందుకు ఆర్యవీర్ కు ఇది సరైన వేదిక కానుంది.



### ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదు

# వరల్డ్ కప్ టీమ్ పై తేల్చేసిన శుభ్ మాన్ గిల్..!

వచ్చే ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే క్రికెట్ వరల్డ్ కప్ పై టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిన్న వెస్టిండీస్ తో జరిగిన మూడో వన్డేలో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో గిల్.. వచ్చే వరల్డ్ కప్ లో జట్టు కూర్పుపై ఈ వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్ కప్ కోసం టీమ్ లో ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదని, త్వరగా కుదురుకోవాల్సి ఉందని జట్టులో ఆటగాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. విండీస్ తో సిరీస్ గెల్చుకున్నా, మూడో వన్డేలో ఓటమి తర్వాత గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రయోగాలు చేయడానికి అంత సమయం లేదన్నాడు. తాము ఆడాలనుకుంటున్న జట్టు కూర్పుతోనే బరిలోకి దిగాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. తదుపరి సిరీస్ నాటికి తమకు కావాల్సిన ఆటగాళ్లందరూ అందుబాటులోకి వస్తారని ఆశిస్తున్నానని గిల్ తెలిపాడు. ప్రపంచ కప్‌లో తాము ఏ కూర్పుతో ఆడాలనుకుంటున్నామో, ఆ కూర్పుతోనే ఆడటం ప్రారంభించాలనుకుంటున్నామని తేల్చిచెప్పేశాడు. వాస్తవానికి విండీస్ తో సిరీస్ జరుగుతున్న సమయంలోనే 2026 ఆసియా క్రీడలు కూడా జరగడంతో, ఆ జట్టులో సభ్యుడిగా ఉన్న టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అలాగే గాయం కారణంగా హార్దిక్ పాండ్యా కూడా జట్టుకు అందుబాటులో లేదు. వివిధ కారణాల వల్ల ఆటగాళ్లు జట్టుకు దూరమవ్వడం నిరాశ కలిగించే విషయమని గిల్ అభిప్రాయపడ్డాడు. దీంతో రాబోయే సిరీస్ లకు బుమ్రా, హార్దిక్ లను జట్టులోకి తీసుకుని ఆడించేందుకు గిల్ సిద్ధమవుతున్నాడు.



# వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా



టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు. వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. "ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను" అని మోర్కెల్ తెలిపాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. "నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని 'ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?' అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు" అని వివరించాడు. ఇక భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.



# భారత కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్ హాంకాంగ్ సిక్సెస్ టోర్నీకి సిద్ధమైన టీమిండియా

హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. భువనేశ్వర్ కుమార్ సారథ్యంలోని భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. భువనేశ్వర్ కుమార్‌తో పాటు కృనాల్ పాండ్యా, నితీష్ రాణా, శశాంక్ సింగ్, టీ నటరాజన్, రాహుల్ తెవాటియా, రాహుల్ త్రిపాఠి ఈ జట్టులో ఉన్నారు. న్యూజిలాండ్‌తో 2022లో చివరి టీ20 మ్యాచ్ ఆడిన భువనేశ్వర్ కుమార్.. మళ్లీ భారత్ తరఫున ఆడలేదు. ఇన్నాళ్లకు ఐసీసీ ఆమోదం ఉన్న హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఈ టోర్నీ జరగనుంది.ఐసీసీ ఆమోదంతో క్రికెట్ హాంగ్ కాంగ్ ప్రతీ ఏడాది ఈ భిన్నమైన టోర్నీని నిర్వహిస్తుంది. ఈ టోర్నీ ఫార్మాట్, నిబంధనలు.. ఐసీసీ రూల్స్‌కు భిన్నంగా ఉంటాయి. ఈ టోర్నీలో ప్రతీ జట్టులో ఆరుగురు ఆటగాళు మాత్రమే ఉంటారు. బౌలర్, కీపర్ మినహాయించి మైదానంలో నలుగురు ఫీల్డర్లు మాత్రమే ఉంటారు. దాంతో బ్యాటర్లకు పరుగులు చేయడం సులువవుతోంది. ప్రతీ మ్యాచ్ 6 ఓవర్ల చొప్పున జరుగుతుంది. ఒక మ్యాచ్ సగటున 45 నిమిషాల్లోనే పూర్తవుతుంది. వికెట్ కీపర్ మినహా జట్టులోని ఐదుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా బౌలింగ్ చేయాలి. ఒక బౌలర్ గరిష్టంగా 2 ఓవర్లు వేయవచ్చు. కానీ వరుసగా వేయడానికి లేదు. మిగిలిన నలుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా ఒక్కో ఓవర్ వేయాలి. ఈ ఫార్మాట్ ఆల్‌రౌండర్లకు బాగా కలిసొస్తుంది. ఏ బ్యాటర్ అయినా వ్యక్తిగతంగా 50 పరుగులు పూర్తి చేయగానే నాటౌట్‌గా రిటైర్ కావాలి. ఒకవేళ జట్టులోని 5 వికెట్లు పడిపోతే, నాటౌట్‌గా మిగిలిన చివరి బ్యాటర్ ఒంటరిగానే బ్యాటింగ్ కొనసాగించవచ్చు. అయితే అతనితో పాటు రన్నింగ్ చేయడానికి నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఒక రన్నర్ (ఔటైన ఆటగాడు) ఉంటాడు.జట్టు ఇన్నింగ్స్ ముగిసే సమయానికి ఓవర్లు మిగిలి ఉండి, చివరి వికెట్ పడిపోతే, అంతకుముందు 50 పరుగులు చేసి రిటైర్ అయిన బ్యాటర్ మళ్లీ క్రీజ్‌లోకి రావచ్చు. ప్రతి వైడ్ లేదా నో బాల్‌కి ప్రత్యర్థి జట్టుకు 2 పరుగులు అదనంగా ఇస్తారు. సాధారణంగా ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే 5 ఓవర్లకు బదులుగా 8 ఓవర్లు లేదా ప్రత్యేక వైవిధ్యమైన రూల్స్ ఉపయోగిస్తుంటారు. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో సహా మొత్తం 12 జట్లు పోటీపడుతాయి.

# మహారాష్ట్ర జట్టు కెప్టెన్‌గా పృథ్వీ షా!



టీమిండియా వెటరన్ ఓపెనర్ పృథ్వీ షాకు సారథ్య బాధ్యతలు దక్కాయి. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2026లో అతను మహారాష్ట్ర జట్టును నడిపించనున్నాడు. ఈ టోర్నీ తొలి మ్యాచ్ కోసం మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ తమ జట్టును ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్.. జట్టుకు దూరమవడంతో తొలి మ్యాచ్‌కు పృథ్వీ షాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు.రుతురాజ్ గైక్వాడ్ భారత్-ఏ సారథిగా.. పుదెచ్చరి వేదికగా ఆస్ట్రేలియా-ఏతో మూడు అనధికారిక వన్డేలు ఆడనున్నాడు. ఈ వన్డే సిరీస్ అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో జరగనుంది. మహారాష్ట్ర ఆల్‌రౌండర్ అర్షిన్ కులకర్ణి కూడా భారత్- ఏ జట్టులోనే భాగం కావడంతో తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. గత సీజన్‌కు ముందు పృథ్వీ షా మహారాష్ట్ర జట్టులో చేరిన సంగతి తెలిసిందే. ఆ సీజన్‌లో పృథ్వీ షా 537 పరుగులు చేసి మహారాష్ట్ర తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్‌గా పృథ్వీ షాకు మంచి రికార్డ్ ఉంది. అతని సారథ్యంలో భారత జట్టు 2018 అండర్ 19 ప్రపంచకప్ గెలిచింది.



# డబ్ల్యూసీఎల్ నుంచి పాక్ జట్టు ఔట్!

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించిన భారత మాజీ క్రికెటర్ల నిర్ణయంపై ఇప్పుడు మరోసారి చర్చ మొదలైంది. గత సీజన్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ తీసుకున్న నిర్ణయంపై క్షమాపణ చెప్పాలని పాకిస్థాన్ ఇప్పుడు డిమాండ్ చేసినట్లు సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ ఎన్‌డీటీవీ కథనం పేర్కొంది. ఎన్డీటీవీ కథనం ప్రకారం... ఈ డిమాండ్‌ను 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ ఛాంపియన్స్ ప్రస్తుత టోర్నీ నుంచి వైదొలిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో.. భారత జట్టు పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించింది. ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయంలో భారత్ వెనక్కి తగ్గలేదు. దీంతో గత సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ రద్దయింది. సెమీఫైనల్లోనూ భారత్ ఇదే వైఖరిని కొనసాగించింది. పాక్‌తో ఆడేందుకు భారత ఆటగాళ్లు మైదానంలోకి దిగకపోవడంతో పాకిస్థాన్ వాకోవర్‌తో ఫైనల్‌కు చేరింది. భారత జట్టులో యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లా, యూసుఫ్ పఠాన్, రాబిన్ ఉతప్ప వంటి మాజీ ఆటగాళ్లు ఉన్నారు. ఈసారి టోర్నీలో పాల్గొనేందుకు పాక్ ఆటగాళ్లకు పీసీబీ ఎన్‌ఓసీలు ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే గత సీజన్‌లో తీసుకున్న నిర్ణయంపై భారత్ నుంచి లిఖితపూర్వక క్షమాపణ కోరింది. అంతేకాదు.. భారత ఆటగాళ్లు టోర్నీలో పాల్గొనకపోయినా అభ్యంతరం లేదని నిర్వాహకులు హామీ ఇవ్వాలని కూడా కోరింది. అయితే ఈ డిమాండ్లను డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు అంగీకరించలేదు. దీంతో పాకిస్థాన్ ఛాంపియన్స్ టోర్నీ నుంచి తప్పుకుంది. దీనిపై డబ్ల్యూసీఎల్ మాత్రం 'అనుకోని పరిస్థితుల కారణంగా' పాక్ జట్టు వైదొలిగినట్లు ప్రకటించింది. 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) అనేది మాజీ అంతర్జాతీయ క్రికెటర్లతో నిర్వహించే టీ20 లీగ్. ఇందులో వివిధ దేశాలకు చెందిన మాజీ స్టార్ క్రికెటర్లు ఆయా దేశాల పేర్లతో జట్లుగా బరిలోకి దిగుతారు. భారత్ తరఫున యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్ వంటి మాజీ ఆటగాళ్లు ఆడుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆటగాళ్లకు మరోసారి మైదానంలో అభిమానులను అలరించే అవకాశం కల్పించడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశం.


Edited & Printed by:Vulloju Srinivas Published & Owned by:Shabari Media House Plot No. 3-421,Journalist Colony,Dammaiguda,Keesara Circle,Medchel Malkajgiri, 500083
RNI NO : TGTEL/25/A4103 Contact : 9848588616 Email : vsrinivasetv@gmail.com